# ఓ వీధి భాగోతం

## కెప్టెన్ షేక్ మౌలాలీ

ఆంధ్రదేశంలో ఒక నగరం అది. అందులో ఓ వీధి. వీధి అనేకంటె 'సందు' అంటేనే బావుంటుంది. కాని మునిసిపాలిటి దానిని వీధిగ గుర్తించింది. మనిషి నిల్చుని రెండు చేతులు అడ్డంగ చాచితే సందు కిరువైపుల గోడలు తగులవలసిందే !

దాదాపు రెండు ఫర్లాంగుల పొడవున్న ఆ సందులో ఒకప్పుడు రిక్షాబండి ఇరుకు వంతెనపై లేల్యాండ్ లారీలాగ వెళ్ళగలిగేది. కాని ఇప్పుడు ఒక్కమనిషి మాత్రమే వెళ్ళగలిగిన స్థలం ఉంది. అదీ జాగ్రత్తగా వెళ్ళగలిగితేనే !

దీనికి కారణం లేకపోలేదు.

కుటుంబనియంత్రణ ప్రచారం ప్రభుత్వం, రేడియో, పత్రికలు ఎంత విరివిగా జరిపినా — ''మా పిల్లలే ఈ దేశానికి బరువయ్యారా !'' అనుకుంటూ ఇంటికి అరడజనుకు తగ్గకుండ పోటీలుపడి మరీ కన్నారు పిల్లల్ని !

కాని వసతులు మాత్రం పెరగలేదు.

ఓ రోజు, ఓ యమ్మ పిల్లవాడి 'పురిటి పొత్తి'ని వీధిలో పడవేసింది. దానికోసమే కాచుక్కూర్చున్న ఓ కాకి ముక్కుతో దానిని నాలుగు పొట్లు పొడిచి పక్కవాకిట్లో పడేసింది.

అక్కడే కథ మొదలైంది.

ఆ ఇంటావిడ 'గయ్'మని లేచింది. 'పొత్తి'ని తీసెయ్యమన్నది.

''నేను వేయలేదు కనుక తీసే ప్రశ్న లేదని'' వచ్చింది సమాధానం.

మాటా—మాటా పెరిగింది.

''అయితే యిక నుండి మా పిల్లల్ని మీ వాకిలి ఎదురుగుండా కూర్చోపెడతా'' నంది.

''సరే చూద్దాం !'' అంటే ''సరే ! '' ననుకున్నారు.


మొత్తం మీద ఆ రెండిళ్ల పిల్లలు నడి వీధిలో కూర్చోటం మొదలెట్టారు.

''ఇదేదో ఆడవాళ్ల విషయ'' మనుకొని మగాళ్లు సరిపుచ్చుకున్నారు.

ప్రక్క యిళ్ల వాళ్లందరికి వళ్లు మండింది. వారి పిల్లలు కూడా బజారును అలంకరించ సాగారు.

ఇదంతా చూసి రాత్రిళ్లలో 'ముసలా — ముతకా' కూడ ఉపయోగించ ప్రారంభించారు.

వాటిమీద కసవూ, చచ్చిన ఎలుకలూ చేరి



# ఓ వీధి భాగోతం

'కుళ్ళు రాజకీయాల కంపు'ను గుర్తు కు తేసాగింది.

కాని అక్కడి ప్రజ దానికి యిమ్యూన్ అయిపోయింది.

''ఎంత శుభ్రం చేసినా ఈ వీధి బాగు పడదని'' మునిసిపాలిటీ వారు అలిగి ఆ వేపు రావటం మానివేశారు.

అందుకే ఒక్కమనిషి మాత్రమే ఒకసారి ఆ వీధిలో అడుగులు జాగ్రత్తగా వేసుకుంటూ [కొత్తగా డ్యాన్సు నేర్చుకునేవారిలాగ] వెళ్ళగలడు ఒక్కోసారి లాంగ్‌జంప్, హైజంప్ కూడ చేయాల్సివస్తుంది.

ప్రక్క వీధులవారు ఆవేపు రావటం మానివేశారు.

ఇది ఒక విధంగ ఆ వీధి ఐకమత్యాన్ని, ప్రత్యేకతను, సమరసత్వాన్ని చాటుతుంది.

కొంత కాలానికి వీధి రెండు చివరలా రెండు ఆసుపత్రులు కూడ వెలిశాయి.

కొంత కాలం గడిచింది.

అక్కడ వారందరికీ ఉన్నట్లుండి తళుక్కున ఓ ఆలోచన తట్టింది.

ఆ వీధిలో నీళ్ళ కుళాయి లేదు. వేయించా లనుకున్నారు.

సంతకాల సేకరణ జరిగింది. అర్జీలు వ్రాశారు. తిట్టుకుంటూనే ముడుపులు చెల్లించారు. వంతుల ప్రకారం ఆఫీసు చుట్టూ తిరిగారు.

కుళాయి శాంక్షన్ అయినట్లు తెలిసింది. ఆ రోజు పండుగ జరుపుకున్నంత పని అయింది.

రోజుల తరబడి ఎదురు చూశారు.

''అదిగో వస్తుంది, ఇదిగో వస్తుంది !'' అన్నారు.

కాని కుళాయి రాలేదు.

ఓసారి ఆఫీసులో కనుక్కున్నారు.

''అర్జీలు శాంక్షన్ చేసేది ఒక సెక్షన్, దానిని వేసేది మరో సెక్షన్'' అని తెలిసింది.

వారిచుట్టూ ప్రదక్షిణలు చేశారు.

దక్షిణ చెల్లించుకున్నారు. లోలోపల సహస్ర నామార్చన (తిట్లు) చేశారు.

ఒక రోజు కొందరు కూలీలు వచ్చి వీధి పొడవునా నడుములోతు గొయ్యి తవ్వారు.

ఒక నెల గడిచింది.

దానిని పట్టించుకున్న నాధుడు లేదు.

ఈ మధ్య నలుగురు పిల్లలు, నలుగురు ముసలాళ్ళు కాలుజారి అందులో పడ్డారు.

వీధి జనమంతా ఆఫీసు చుట్టూ తిరిగి వరపడ్డారు.

''వర్షంమూలాన పని ఆగింది. నాలుగు రోజుల్లో వస్తాం''' అన్నారు.

వర్షం ఎప్పుడు కురిసిందో అర్ధంకాలేదు జనానికి.

తీరా మునిసిపాలిటీవారు వచ్చేసరికి ఆయమ్మ, ఈయమ్మ వేసిన కసివుతో గొయ్యి సగం పూడిపోయింది.

''మేము తవ్విన గోతిని పూడ్చారు కనుక మీరే దీనిని తిరిగి తవ్వాలి!'' నిక్కచ్చిగా అన్నారు.

ఎవరి యింటిముందు మట్టిని వారు తీశారు.

మొత్తంమీద వీధి మధ్యలో ఒక కుళాయి వెలిసింది.

లాంగ్ జంప్, హైజంప్, భరతనాట్యం నగయిరా చేస్తూనే బిందెమీద బిందె నీళ్ళు అందుకుందామనుకున్నారు పాపం వీధి వారంతా.

వీధికి ఉన్న ఉక్కగా ఒక్క 'బావి' ఆ క్షణంలో 'అడ్డు' అనిపించింది. వెంటనే చెత్తా చెదారం వేయటం మొదలెట్టారు. ఓ తాత ఈ పని వద్దని కొళాయి నీళ్లు వచ్చాక బావి పూడ్చొచ్చని మొత్తుకుంటున్నా వినకుండా ఆ పని ప్రారంభించారు.

నాలుగు చేతులూ కలిశాయి.

అరగంటలో బావిని పూడ్చారు.

''రేపు ఉదయం నీళ్లు వస్తాయని'' పంపు బిగించినవాళ్లు చెప్పి వెళ్లారు.

ఆ రాత్రి ఏయింటి ఇల్లాలికీ నిద్ర పట్టలేదు. అదవా కన్ను మూత పడినా కుళాయి కానవచ్చేది. ఎదురింటావిడో, పక్కయింటావిడో ముందు బిందె వేసినట్లు, తనకంటే రెండు బిందెలు ఎక్కువ పట్టినట్లు కల వచ్చేది. వెంటనే కలవరింతలు. లేచి కూర్చోటం.

తొలికోడి కూసింది.

అంతా లేచి చింతపండు గ్రటా వేసి బిందెలు తోమటం మొదలు పెట్టారు.

తిరిగి నాలుగున్నర గంటలకు మళ్లీకోడి కూసింది.

ఇళ్లల్లో బిందెలవీ వీధిలోకి వచ్చాయి. ఆ చీకట్లోనే భరతనాట్యం చేశారు. కొందరు ఒడిస్సీ చేస్తే మరికొంధరు కథాకళి చేశారు.

కుళాయికి ఇరువైపులా బిందెలు వంకలో పెట్టుకొని వరుసగా నిలువబడ్డారు.

చంద్రుడ్ని మింగటానికి రాహుకేతువులు ఒకేసారి తారసపడ్డారా అన్నట్లున్నాయి ఆ క్యూలు.

''పంపు ఐదింటికే వస్తుందన్నారే ?'' అంది ఒక మధ్యవయస్కురాలు.

''పంపు నిన్ననే వచ్చిందిగా ! ఇప్పుడు రావలసింది నీళ్ళు !'' చమత్కరించింది ఒక పడచు గొంతు.

ఆవిడవైపు 'కొర—కొరా' చూసిందా మధ్యవయస్కురాలు.

తెల్లవారింది.

కాని నీళ్ళు రాలేదు.

వారు నిలుచున్నచోట పాతడబ్బాలు, కుండపెంకులు గుర్తుగా పెట్టుకొని ఇళ్ళకు వెళ్ళారు.

గబగబా ముఖాలు కడుక్కొని ఆత్రంగా బిందెలు తీసుకొని తిరిగి వీధిలోకి ఉరికారు.


అదో కొత్తరకం 'రన్నింగ్ రేస్'లా ఉంది.

సూర్యుడు చెట్లచాటునుండి పైకివచ్చాడు. ఎండాకాలం మూలాన కర—కర లాడుతున్నాడు.

చిన్నపిల్లలు నిద్రలేచి వారి కార్యక్రమం సాగించారు.

మహిళలకు ఓపిక తగ్గింది. సహనం నశించింది. నిల్చోలేకపోతున్నారు.

ఇటీవల హైదరాబాదు ఆంధ్రబాలానంద సంఘంలో ప్రొ. బి.వి. పట్టాభిరావ్ హిప్నాటిజం తరగతులు నిర్వహించిన సందర్భంగా విద్యార్థులు ఒకరు నొకరు హిప్నటైజ్ చేస్తున్న దృశ్యం.



''ఇంతకూ నీళ్ళు వస్తాయా ?'' అందొకామె.

''రాకపోతే ఎందుకు నిల్చోటం. తిరిగి వెళ్ళరాదూ ?'' మరొక యువతి సమాధానం.

''నువ్వే వెళ్లరాదూ ! ''

''నువ్వే పో ! ''

''జాగ్రత్త !'' అంటే ''జాగ్రత్త'' అనుకొని చెమటలు తుడుచుకున్నారు.

కొన్ని నిముషాలు గడిచాయి. ఎవరికీ ఏమీ తోచటంలేదు.

''ముదనష్టపోళ్లు !'' అందొక గొంతు.

''ఎవరు ?'' అందుకుంది ప్రక్కనున్న మహిళ.

''ఓట్లకోసం వస్తారే ... వాళ్లు'' దీర్ఘం తీసింది.

''నీళ్ల తెచ్చేందుకే వారున్నారా ? ''

''మరి ఎందుకున్నట్లు ?''

''మనం ఎన్నుకున్నాం కనుక ! ''

''మన వసతులు చూడొద్దూ ?''

''వసతులంటే ?''

''రోడ్డు, బస్సు, కరెంటు, నీళ్ల గట్రా అన్నీ.''

''ఇవన్నీ చేయటానికి వేరు వేరు శాఖలున్నాయి. నీళ్ల మాత్రం మునిసిపాలిటి వారి బాధ్యత'' చదువుకున్న ఒక మహిళ విశద పర్చింది.

''పోనీ వాళ్లే ననుకోండి ! ''

''కౌన్సిలర్ ఏడీ పత్తాలేడు ! ''

''మళ్లా ఎలక్షన్ల నాటికి కనపడతాడు ! ''

''పాపం పంపేయించాడు కదా ! '' కౌన్సిలరుకు వత్తాసుగ పలికింది ఆ కులపు వనిత.

''అతనేం ఏయించలా... మనమే తలా కాస్త లంచం యిచ్చి ఏయించుకున్నాం.''

''నువ్వు కవున్సిలరు అయితే అన్నీ చేస్తావా ?'' సాగదీసింది.

''అమ్మాయ్, మాటలు జాగ్రత్తగా రానీయ్ !''

సంభాషణ అంతటితో ఆగింది.

ఎనిమిది గంటలు కొట్టింది.

కాళ్ళు పీక్కుపోతున్నయి.

ఇంతలో వీధి చివర పాలవ్యాను కనపడింది. గబగబ వెళ్ళి ప్యాకెట్లు అందుకున్నారు. అర క్షణంలో కాచి కాఫీలు కలిపి భర్తలకు పిల్లలకు యిచ్చి పర కడుపుతోనే వీధిలోకి పరుగెత్తారు.

ఎనిమిదిన్నర కావచ్చింది. కళ్ళు బైర్లు మ్ముతున్నయి. ఇంతలో పది పాములు ఏకకాటిగ బుసకొట్టినట్లు పంపులో శబ్దం గాసాగింది.

అంతా ఆత్రంగ తోసుకుంటున్నారు.

''నేను ముందంటే నేను ముంద''ను కుంటున్నారు.

''అసలు నీళ్ళు రానీయండమ్మా ! తలా ఒకటి పట్టుకోవచ్చు!'' అందో పెద్ద యిల్లాలు.

'గ్యాస్' రావటం ఆగింది.

''పరవాలేదు ! ఇక నీళ్ళొస్తయి.'' అని చకోర పక్షుల్లా ఎదురు చూడసాగారు.

కాని నీళ్ళు రాలేదు.

తొమ్మిది గంటలయింది.

''అదో నీళ్ళొచ్చాయి'' అంది ఓ పదేళ్ళ అమ్మాయి. అంతా చెమటలు తుడుచుకున్నారు.

భాగ్యలక్ష్మి లాటరీలో తలా లక్ష రూపాయిలు వచ్చినంత సంబర పడ్డారు.

''అమ్మాయ్ ! కింద పోనీ కుండ పట్టుకోండమ్మా !'' వెనుక నుండి యాభై ఏళ్ళ ముత్తైదువు కేకవేసింది.

''నీళ్ళు యింకా రానే లేదు. నాలుగు బొట్లు రాలాయి.'' ఒక యువతి నిట్టూర్చింది.

''తొందరేముందిలేమ్మా ! రాక ఎక్కడకు పోతుంది ! కాస్త ఓపిక పట్టాలి, మొదటి రోజు కదా'' మరో మహిళ ఓదార్చింది.

కొన్ని నిముషాలు ఓపిగ్గా, నిశ్శబ్దంగ నిల్చున్నారు.

తిరిగి అలజడి మొదలైంది.

'పోనీ ఇవ్వాల్టికి బావి నీళ్ళు తెచ్చుకుంటే సరిపోదూ !'' అన్నారొకరు.

''బావిని పూడ్చారుగా, ముదనష్టపు పంపును నమ్ముకొని !''

''రోజూ యింతే నేమో !''

''ఏమో ఎవరు చూచారు !''

మార్తాండుడు తీక్షణంగ నవ్వుతున్నాడు. అందరి కళ్ళూ తూలుతున్నయ్.

పది గంటలయింది.

వీధి మగవారు తమ తమ పనులకు బయలుదేరారు.

''ఏమండీ ! కాస్త ఫోను చేసికనుక్కోండి!'' ఓ యిల్లాలు ప్రాధేయపూర్వకంగ అడిగింది.

వీధి చివర ఆసుపత్రినుండి వాటర్ సప్లయికి ఫోను చేశారు.

''ఏమన్నారండి ?''

''ఏమంటారు ! నీళ్ళు వదిలామన్నారు !'' నీళ్ళు నములుతూ సమాధానమిచ్చాడు.

వదిలిన నీళ్ళు రాకుండ ఏమయ్యాయి.

''అదీ అడిగాను. పక్క వీధిలో అంతా యిళ్ళకి మోటారు బిగించారంట.''

''అంటే !''

''వదిలిన కాసిని నీళ్ళు వాళ్ళ మోటార్లు లాగేస్తాయి.''

''మరి మన సంగతి ?''

''మన సంగతి యింతే ! ప్రెజర్ చాలక మనకు రావు.''

''అది అక్రమం, అన్యాయం కదూ !''

''అవును !''

''మరి రిపోర్ట్ చేస్తే ?''

''ఎవరి మీద...ఏమని.''

''వారి మీద...మోటార్లు బిగించారని.''

''ఆ వీధిలో అంతా ధనవంతులు, అధికార్లు ! వారిమీద ఏ చర్యా తీసుకోరు.''

''ఇప్పుడేం చేద్దాం ?''

''బావిలో వేసిన కసవుని తిరిగి తలా కాస్త తోడేద్దాం !''

''మరి పంపు...''

''అలంకారప్రాయంగ ఉంటుంది.''

ఈ భాగోతమంతా అయ్యేసరికి పదకొండు గంటలయింది.

ఎండ చిటపట మంటుంది.

ఓపికలు నశించిన మహిళలు చైతన్య రహితంగ తమ తమ గుమ్మాల వైపు తిరిగి వెళ్లారు.

అయితే ఈసారి ఎవ్వరూ లాంగ్ జంప్, హైజంప్, మరి ఏ నాట్యమూ చేయలేదు. దారిలో కుప్పలు తొక్కుంటూనే నడిచారు. ★

